

జగతికి జనని లూర్దుమాత

లూర్దుమాతను యావత్ జగతికి జననిగా భావించి ఆరాధిస్తారని ఉరుటూరు విచారణ గురువులు ఫాదర్ కాను జోజిరెడ్డి బుధవారం పేర్కొన్నారు. -8లో



కౌన్సిలర్లను ప్రలోభపెడుతున్నారు

తమ పార్టీ కౌన్సిలర్లను పేదరికాన్ని ఆసరా చేసుకుని డబ్బును ఎరగా వేసి టీడీపీ నేతలు ప్రలోభపెడుతున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.5/18.8

వాతావరణం

జిల్లాలో బుధవారం 18.8 – 35.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

భాకరాపేటలో స్టాపింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప–తిరుపతి మధ్య నడుస్తున్న నాన్ స్టాప్ బస్ సర్వీసుకు భాకరాపేటలో స్టేజీ ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఈ నాన్ స్టాప్ సర్వీసులకు టిక్కెట్ ఇచ్చేందుకు కండక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని భాకరాపేట ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పాలిమేర గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.00 నుంచి 5.00 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలను 99592 25774 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

యాత్ర-2 పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించిన యాత్ర-2 సినిమా పోస్టర్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్.యానాదయ్య, హరూన్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్‌బాషాలు బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి మొదలైన ఈ ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్, నాగరాజుపేట మీదుగా రవి గ్రూప్ థియేటర్స్ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్, ఎ.బాలక్రిష్ణారెడ్డి, ఆర్‌వీ రమణ, కె.బాబు, కిరణ్, సుబ్బరాయుడు, లక్ష్మినారాయణ, అర్జున్, దత్తసాయి పాల్గొన్నారు.

11న దళిత సింహగర్జన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్

కడప రూరల్: దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 11వ తేదీన రాజమండ్రిలో నిర్వహించే దళిత సింహ గర్జన సభను జయప్రదం చేయాలని మాజీ పార్లమెంట్ సభ్యులు హర్షకుమార్ అన్నారు. కడపలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దళితులపై పెత్తందార్లు దాడులకు తెగపడున్నారని తెలిపారు. ఇందుకు నిరసనగా ఈ నెల 11న నిర్వహించే దళిత సింహ గర్జన సభను జయప్రదం చేయాలన్నారు. విజయ్, వినోద్, ఆర్ఎస్ రాజ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ గీతిక..ప్రగతి దీపిక

- ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వ నిర్దేశం
- రాజంపేటకు అన్నమాచార్య యూనివర్సిటీ
- వైఎస్సార్–ఈఎంసీలో రూ.450 కోట్లపెట్టుబడులు
- రైతు భరోసా ద్వారా జిల్లాకు రూ.283కోట్ల లబ్ధి
- బడ్జెట్‌పై సర్వత్రా హర్షం



సాక్షి ప్రతినిధి, కడప: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా, సామాజిక సమతుల్యత ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రూపొందించింది. బడుగులకు సంక్షేమ పథకాల కొనసాగిస్తూనే, మహిళలను మహారాణులుగా, రైతులకు భూభద్రత కల్పన, భరోసా, సుపరిపాలన అందించడమే లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,86,389 కోట్ల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను శాసనసభలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి బుధవారం ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో వైఎస్సార్ పెన్షన్ కానుక, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, ఉచిత వడ్డీ రుణాలు, వైఎస్సార్ వడ్డీ రహిత రైతు రుణాలు, కాపు నేస్తం, జగనన్న చేదోడు, మైనార్టీల సంక్షేమం, కాపు నేస్తం, అగ్రవర్ణ పేదల ఉన్నతి, వైఎస్సార్ వాహన మిత్ర, నేతన్ననేస్తం, మత్స్యకార భరోసా తదితర సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కేటాయింపులు కొనసాగించింది.

పరిశ్రమల పట్ల ప్రత్యేక చొరవ

రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించి పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ పాలసీ తీసుకువచ్చింది. కొప్పర్తి కేంద్రంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్–ఈఎంసీ పథకంలో 500 ఎకరాలల్లో మౌలిక వసతులు కల్పించారు. 2023 జూలైలో చేపట్టిన ఎంఓయూ ద్వారా రూ.450 కోట్లు పెట్టుబడులతో 6,300 మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలను కల్పించనుంది. జేఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది.

రాజంపేటలో అన్నమాచార్య యూనివర్సిటీ

రాజంపేట కేంద్రంగా అన్నమాచార్య యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటికే వైఎస్సార్ జిల్లా కేంద్రంగా యోగి వేమన విశ్వవిద్యాలయం, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ఉన్నాయి. తాజాగా అన్నమాచార్య యూనివర్సిటీ అందుబాటులోకి రానుంది. రాష్ట్ర వ్యాప్తంగా 9,52,925 మందికి ఉచితంగా ట్యాబ్స్ అందిస్తోంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో దాదాపు 35వేల మంది విద్యార్థులకు ట్యాబ్స్ దక్కనున్నాయి. అలాగే రైతు భరోసా రూపేణా అన్నదాతలకు రూ.283 కోట్లు వైఎస్సార్ జిల్లాలోని 2.11లక్షల మంది రైతులకు దక్కనుంది. 70వేల మందికి సున్నా వడ్డీ రాయితీ ద్వారా మరో రూ.25కోట్లు లభించనుంది. రైతు భూభద్రత కోసం సంపూర్ణ రీసర్వే చేపట్టేందుకు కృత నిశ్చయంతో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలను మహారాణులుగా చేయాలన్నదే లక్ష్యంతో ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

జనాకర్షక బడ్జెట్



ఆంధ్రప్రదేశ్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనాకర్షకంగా ఉంది. ఏప్రిల్ నుంచి జూలై నెల వరకే బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికి, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూనే రాష్ట్రంలోని సమస్యల పరిష్కారానికి చొరవ ప్రదర్శించారు. వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు సేవలందించేందుకు నిర్ణయించడం సంతోషదాయకం.
– కె. సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు

పారిశ్రామికాభివృద్ధికి దోహదం



రాష్ట్ర విభజన అనంతరం పారిశ్రామిక రంగం అభివృద్ధికి దోహదం చేసే చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఓడరేవుల అభివృద్ధికి రూ.20వేల కోట్లు కేటాయించడం అభినందనీయం. ఓడరేవుల ఆధారిత పారిశ్రామిక నిర్మాణం, అభివృద్ధి కీలకంగా భావించి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. పెట్టుబడులు సాధించడంలో గణనీయమైన అభివృద్ధి, ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం. – కె. శివరాం, అర్థశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

ఆర్థికాభివృద్ధికి దోహదం



ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సంక్షేమానికి స్ఫూర్తిగా నిలిచింది. సంక్షేమ సూచికలైన విద్య, వైద్యమే లక్ష్యంగా బడ్జెట్ ప్రవేపెట్టడం సంతోషకరం. రూ.2,86,389.27 కోట్ల అంచనాతో వ్యవసాయానికి ప్రాధాన్యతను ఇచ్చారు. బడుగు, బలహీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం బడ్జెట్‌లో కనిపిస్తోంది. అమర్త్యసేన్ సూత్రమైన సంక్షేమం ద్వారా ఆర్థికాభివృద్ధి పెరుగుదలకు ప్రాధాన్యత ఏర్పడింది.
– కనపర్తి త్రివిక్రమ్ రెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎర్రగుంట్ల

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించింది. విద్యకు, వైద్యానికి ప్రాధాన్యత కల్పించారు. అసెంబ్లీలో రూ.2,30,110 కోట్ల రెవెన్యూ వ్యయం, రూ.30,530 కోట్ల మూలధన వ్యయంతో పద్దును ప్రతిపాదించారు.
– డాక్టర్ మూలె రామమునిరెడ్డి, విశ్రాంత తెలుగు పండితుడు ప్రొద్దుటూరు

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమ రంగానికి పెద్దపీట వేసింది.వెనుకబడిన వర్గాల సంక్షేమానికి రూ.71,740 కోట్లు కేటాయించడం ద్వారా వారికి ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను చాటిచెప్పారు. వ్యవసాయరంగం, విద్యారంగానికి పెద్దపీట వేశారు.
–ఎం. గురుమోహన్‌రెడ్డి, అర్థశాఖ సహాయ ఆచార్యులు, ఎస్‌కేఆర్,ఎస్‌కేఆర్ కళాశాల, కడప

అందరికీ ఉపయుక్తమైన బడ్జెట్



బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయం, సంక్షేమానికి పెద్దపీట వేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి, ఇదే క్రమంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు మంచి చేసింది. ఈ బడ్జెట్ వలన రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉపయుక్తంగా ఉంది. –తెలిదేల లక్షుమయ్య, మండల అధ్యక్షులు, చాపాడు మండలం

జనరంజకంగా ఉంది



ఏపీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ జనరంజకంగా ఉంది. విద్య, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఏ వర్గాన్ని విస్మరించకుండా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామం –బి. శంకర్ నాయక్, ఎంబీఏ హెచ్‌ఓడీ, కురబలకోట మండలం

బీసీ సంక్షేమానికి పెద్దపీట



ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి ఏకంగా రూ.71,740 కోట్లు కేటాయించడం రాష్ట్ర చరిత్రలోనే రికార్డు. బీసీల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన 56 కార్పొరేషన్లకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం అభినందనీయం.
– జబ్బలశ్రీనివాసులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం సౌత్‌ఇండియా అధ్యక్షులు

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటిదాకా తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి మార్పులు, చేర్పులు చేసి ఓటర్ల జాబితా తయారు చేసినట్లు చెప్పారు. ఇకపై సుమోటోగా తీసుకుని మార్పులు, చేర్పులు చేపట్టలేమని స్పష్టం చేశారు. మార్పులు, చేర్పులు చేయాలంటే తగిన ఆధారాలను జతచేసి సంబంధిత ఫారంలో ఫిర్యాదు చేయాలని రాజకీయ పార్టీలకు తెలిపారు. గత సంవత్సరం జనవరి 6 నుంచి డిసెంబరు 9 వరకు సుమారు ఆరు లక్షల ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. గతనెల 22న తుది జాబితా ప్రకటించామన్నారు. ఈ జాబితా తర్వాతకూడా ఫారం-6. 7, 8 అర్జీలు వచ్చాయన్నారు. ఇప్పటికే చాలావరకు పరిశీలించామని తెలిపారు. ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు ఉంటే ఆయా నియోజకవర్గాల ఈఆర్‌ఓల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. టీడీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, బీ జేపీ నేత లక్ష్మణరావు,బీఎస్పీ నాయకుడు కానుగదానం, సీపీఎం నాయకుడు మనోహర్, కాంగ్రెస్ నాయకుడు సుధాకర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకుడు సుధీర్ పాల్గొన్నారు.

రేపు 'స్మార్ట్ టౌన్‌షిప్' ప్లాట్ల కేటాయింపు

కడప కార్పొరేషన్: కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం వద్ద ఏర్పాటు చేస్తున్న 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్'లో ప్లాట్ల కేటాయింపు ఈనెల 9వ తేదీ జరుగనుందని కుడా వైస్ చైర్మన్ వైఓ నందన్ తెలిపారు. బద్వేల్ మున్సిపాలిటీలోని కౌన్సిల్ హాలులో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని, లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి విచ్చేసి తమకు కేటాయించిన ప్లాట్ల వివరాలు తెలుసుకోవాలని కోరారు. గోపవరం మండలంలో మొదటి విడతలో 30.42 ఎకరాల విస్తీర్ణంలో డీటీసీపీ అప్రూవల్‌తో 358 ప్లాట్లు గల ఎంఐజీ లేఔట్ వేశామని, ఇందులో ప్లాట్ల కేటాయింపు లాటరీ పద్ధతిలో జరుగుతుందన్నారు. మధ్య ఆదాయ వర్గానికి చెందిన ప్రజలు ఈ ప్లాట్లను కొనుగోలు చేయడానికి అర్హులన్నారు. ప్లాట్ మొత్తం విక్రయ ధరలో 10 శాతం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అంకన్న



వైవీయూ: కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా యోగివేమన విశ్వ విద్యాలయం ఆంగ్లశాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగుల అంకన్న నియమితులయ్యారు. మైలవరం మండలం భోగాలకట్ట గ్రామానికి చెందిన ఈయన పాఠశాల విద్య జమ్మలమడుగులోను, డిగ్రీ అనంతపురం ప్రభుత్వ కళాశాలలోను, ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ తిరుపతి ఎస్వీయూలో పూర్తి చేశారు. అనంతరం 2009లో వైవీయూ ఆంగ్లశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 2021లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. కాగా ఈయన గతంలో డిప్యూటీ వార్డెన్‌గా, కాంపిటీటివ్ సెల్ డైరెక్టర్‌గా, ప్రవేశాల విభాగం సభ్యుడిగా, ఎగ్జామినేషన్ బ్రాంచ్ అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌గా పలు పరిపాలనమైన విధులను నిర్వహించారు.

నేటి నుంచి వైవీయూ పీజీ పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాల, అనుబంధ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ ప్రథమ సెమిస్టర్ పీజీ పరీక్షలు ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి తెలిపారు. 8, 12, 14, 16, 19, 21 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లతో నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

పక్కాగా.. పారదర్శకంగా..

- జిల్లాలో జోరుగా కొనసాగుతున్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు
- సచివాలయాల్లో ప్రక్రియ ప్రారంభం
- 85,587 మందికి గృహయోగం
- లబ్ధిదారులు మోములో వెల్లివిరుస్తున్న ఆనందం



ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం క్యూలో నిలుచున్న లబ్ధిదారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇంటి యజమానులుగా చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. జగనన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేస్తూ లబ్ధిదారులకు సర్వహక్కులను కల్పిస్తోంది. దీనికి సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో సచివాలయాలు సందడిగా మారాయి. జిల్లాలోని 36 మండలాల్లో ఈ ప్రక్రియను పక్కాగా.. పారదర్శకంగా ప్రారంభించారు. 85,587 మందికి రిజిస్ట్రేషన్లు చేయించేందుకు శ్రీకారం చుట్టారు. ఇల్లు కట్టుకున్నా లేదా స్థలం ఖాళీగా ఉన్నా ఇంటి స్థలాలు ఇచ్చిన వారందరికీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ప్రభుత్వం ఇవ్వనుంది. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్యేక యాప్ ద్వారా

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్లు చేసేందుకు వీలుగా రిజిస్ట్రేషన్‌శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. 12 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో రోజుకు కొంతమందికి సమాచారం ఇచ్చి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనికి సంబంధిత లబ్ధిదారులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోల వేలి ముద్రలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

సచివాలయాల వద్ద సందడి

ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తుండడంతో లబ్ధిదారులైన మహిళలతో సచివాలయాలు సందడిగా మారాయి. పదేళ్ల తర్వాత వాటిని అమ్ముకునే సౌకర్యం కూడా కల్పిస్తున్నారని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లకు లబ్ధిదారులకు అవసరమైన సమయాల్లో బ్యాంకుల రుణ సదుపాయం పొందే అవకాశం ఉంటుంది. వారసులకు గిఫ్ట్ డీడ్ కింద ఇంటిని బదలాయించుకోవచ్చు.

జగనన్న చెబితే...చేస్తారంతే...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏది చెబితే అది వెంటనే అమలు చేస్తారన్న నమ్మకం ప్రజల్లో ఉంది. అందుకు తగ్గట్టుగానే పేదల ఇళ్ల స్థలాలు, ఇల్లు ఇవ్వడమే కాకుండా పట్టాలను కూడా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సాధారణంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వేలాది రూపాయలు ఖర్చవుతాయి. అంత వ్యయం భరించే స్థితిలో లేని పేదలకు భవిష్యత్తులో వారి అవసరాలకు ఉపయోగపడేలా ఇళ్ల పట్టాలను సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయించి సర్వహక్కులతో కన్వెయన్స్ డీడ్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మండలం	మొత్తం రిజిస్ట్రేషన్లు	ఇప్పటివరకు అయినవి
అట్లూరు	379	156
బి.కోడూరు	70	40
బద్వేలు	6407	168
బి.మఠం	737	60
చక్రాయపేట	1256	86
చాపాడు	579	94
చెన్నూరు	1276	474
సీకే దిన్నె	9678	450
కడప	13290	173
దువ్వూరు	1013	126
గోపవరం	127	62
జమ్మలమడుగు	3818	134
కలసపాడు	261	97
కమలాపురం	656	138
ఖాజీపేట	627	225
కొండాపురం	117	20
లింగాల	337	89
ముద్దనూరు	723	133
మైలవరం	621	146
పెద్దముడియం	322	189
పెండ్లిమర్రి	211	165
పోరుమామిళ్ల	931	207
ప్రొద్దుటూరు	23087	430
పులివెందుల	8596	52
రాజుపాలెం	96	71
మైదుకూరు	3148	199
సిద్దవటం	1044	513
సింహాద్రిపురం	472	155
కాశినాయన	188	10
తొండూరు	430	141
వల్లూరు	189	146
వీఎన్ పల్లె	170	49
వేంపల్లె	2292	138
వేముల	304	58
ఒంటిమిట్ట	474	131
ఎర్రగుంట్ల	1661	174

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లు ఇవ్వడమే కాకుండా ఇంటి పట్టాను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం సంతోషకరం. నాలాంటి పేదలపై ఆర్థికభారం పడకుండా చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. – కల్పనాబేగం, జగనన్న కాలనీ, కడప

ఆనందంగా ఉంది



జగనన్న ప్రభుత్వం మాకు ఇంటి స్థలాన్ని మంజూరు చేసింది. అలాగే ఇల్లును కూడా మంజూరు చేశారు. నిర్మాణ పనులు చేస్తున్నాం. ఇప్పుడు మాకు ఇచ్చిన పట్టాకు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి అమలు చేయడం ఆనందంగా ఉంది. – నాగమ్మ, జగన్న కాలనీ, మామిళ్లపల్లె,కడప

కొనుసాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్లు అయ్యేవరకు ఈ కార్యక్రమం కొనసాగుతోంది. లబ్ధిదారులు అధికారులకు తమ వంతు సహకారాన్ని అందించాలి. – మధుసూదన్, ఆర్డీఓ, కడప

ఆనందమానందమాయె

- డీఎస్సీ–24 ప్రకటనతో అభ్యర్థుల్లో వెల్లివిరిసిన సంతోషం
- జిల్లాలో 289 పోస్టులు



ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో ఖాళీలు

ఎస్‌జీటీ : 105
స్కూల్ అసిస్టెంట్ : 81
టీజీటీ : 103
మొత్తం: 289



కడప ఎడ్యుకేషన్/వైవీయూ: విద్యమా మొదటి ప్రాధాన్యత అని చాటిచెబుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జెండా ఊపుతూ మెగా డీఎస్సీ–2024 నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 6100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కేజీబీవీ తదితర 7 యాజమాన్యాల పరిధిలోని ఖాళీలను భర్తీచేసేందుకు డీఎస్సీ ప్రకటించారు. ఇందులో రాష్ట్రవ్యాప్తంగా 2,299 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 2,280 ఎస్‌జీటీ పోస్టులు, 1264 టీజీటీ పోస్టులు, 215 పీజీటీ పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో సైతం 289 పోస్టులు భర్తీ కానుండటంతో అభ్యర్థుల్లో ఆనందం నెలకొంది. ఏళ్లతరబడి కోర్సులు పూర్తిచేసి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఆనందానికి అవధులు లేవు. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల నిరుద్యోగ అభ్యర్థుల్లో సంతోషం నెలకొంది. ఈనెల 8వ తేదీ నుంచి టెట్ ప్రక్రియ, ఈనెల 12వ తేదీన డీఎస్సీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

సంతోషంగా ఉంది..



ఉపాధ్యాయ కొలువు సాధించేందుకు సన్నద్ధమవుతున్న మాకు డీఎస్సీ నోటిఫికేషన్ రావడం సంతోషాన్నిచ్చింది. ఇప్పటికే ప్రిపరేషన్ ప్రారంభించాం. షెడ్యూలు కూడా నిర్ణీత సమయంలోనే పూర్తిచేసేలా ఉంది.
– అనిత, డీఎస్సీ అభ్యర్థి, పులివెందుల

ఆంధ్రా సివిల్స్‌కు సన్నద్ధం..



ఆంధ్రా సివిల్స్‌గా భావించే డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేయడం సంతోషంగా ఉంది. ఉపాధ్యాయ పోస్టు సాధించాలన్న నా కలను ఈ డీఎస్సీ ద్వారా నెరవేర్చుకోవాలని గట్టిగా ప్రయత్నం చేస్తున్నా.
– ప్రియ, డీఎస్సీ అభ్యర్థి, కడప

ప్రిపరేషన్ మొదలెట్టాం..



ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తుందన్న నమ్మకంతో ప్రిపరేషన్‌ను ఇప్పటికే ప్రారంభించాం. నోటిఫికేషన్ రావడం సంతోషాన్నిచ్చింది. ఉపాధ్యాయ పోస్టు సాధించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నాం.
– వేణుగోపాల్, డీఎస్సీ అభ్యర్థి, మైదుకూరు

ప్రభుత్వానికి ధన్యవాదాలు



మెగా డీఎస్సీ–24 నోటిఫికేషన్ విడుదల కావడంతో నిరుద్యోగ అభ్యర్థుల్లో ఉత్సాహం నెలకొంది. సరైన సమయంలో నోటిఫికేషన్ ఇవ్వడం, పోస్టులు సైతం పోటీపడేలా ఉండటం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.
– భరత్‌కుమార్‌రెడ్డి, డీఎస్సీ అభ్యర్థి, బద్వేలు

క్లుప్తంగా

రెండు బైకులు ఢీ



తీవ్రంగా గాయపడిన శివసాయి

పోరుమామిళ్ల : మండలంలోని మార్కాపురం మలుపులో ఎదురెదురుగా మోటార్‌బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో జాతివర్తిపల్లె గ్రామానికి చెందిన శివసాయి, శంకవరం గ్రామానికి చెందిన రామయ్య బైకులు ఢీ కొన్నాయి. దీంతో వీరిద్దరికీశివసాయికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మద్యం మత్తే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

అదుపు తప్పి టిప్పర్ బోల్తా



బోల్తాపడిన టిప్పర్

అట్లూరు : ఇసుక లోడుతో వెళుతున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రమాదం తప్పింది. సిద్దవటం పెన్నానది నుంచి ఇసుకలోడుతో బద్వేలుకు వస్తున్న టిప్పర్ అట్లూరు క్రాస్‌రోడ్డు వద్ద గల చెక్‌పోస్టు సమీపానికి వచ్చే సరికి బ్రేకులు ఫెయిల్ కావడంతో ముందు ఉన్న జనాలను తప్పించేందుకు డ్రైవర్ చాకచక్యంగా పొలాల్లోకి మళ్లించాడు. వేగంగా వస్తున్న టిప్పర్‌ను డ్రైవర్ ఉన్నఫళంగా మళ్లించడంతో అదుపుతప్పి బోల్తాపడింది. అదృష్ట వశాత్తు డ్రైవర్ కూడా సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు. టిప్పర్ బోల్తాపడిన ఘటనలో ఇసుక పూర్తిగా రోడ్డుపై పడటంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

కానిస్టేబుల్ నిజాయితీ

కడప అర్బన్ : ఓ కానిస్టేబుల్ తన నిజాయితీని చాటుకున్న ఘటన ఇది. వివరాలు ఇలా..చెన్నూరుకు చెందిన లక్ష్మీదేవి అనే మహిళ కడప నగరానికి సాయంత్రం షాపింగ్‌కు వచ్చి నగదుతో కూడిన బ్యాగ్‌ను పాత బస్టాండ్‌లో పోగొట్టుకుంది. ఈ బ్యాగ్ తన కంటపడటంతో ఏఆర్ కానిస్టేబుల్ ఎస్. శంకరయ్య (ఏఆర్ పీసీ 3124) తనతో పాటు తీసుకుని వెళ్లారు. ఎవరైనా బ్యాగ్ కోసం వస్తే తనకు ఫోన్ చేయాలని పూల అంగళ్ల వారికి ఫోన్ నంబర్ ఇచ్చి వెళ్లారు. ఆ తరువాత కొద్దిసేపటికి బాధితురాలు లక్ష్మీదేవి పూల అంగళ్ల దగ్గరికి వచ్చి బ్యాగ్ కోసం వెతుకుతుండగా పూల అంగళ్ల వారు కానిస్టేబుల్‌కు ఫోన్ చేయించారు. ఆయన వచ్చి తన దగ్గరున్న బ్యాగ్‌ను బాధిత మహిళకు అప్పగించారు. బాధితురాలు తన బ్యాగ్‌లో ఉన్న 125 దినార్లు, రూ. 20 వేలు నగదును సరిచూసుకుంది. కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలిపింది. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఏఆర్ కానిస్టేబుల్‌ను అభినందించారు.

టీడీపీ నేతలు కౌన్సిలర్లను ప్రలోభపెడుతున్నారు

- బెదిరింపులకూ పాల్పడుతున్నారు
- డబ్బే అస్త్రంగా టీడీపీ నేతలు ఎన్నికలకు వస్తున్నారు
- 15 నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తా
- నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : తమ పార్టీ కౌన్సిలర్ల పేదరికాన్ని ఆసరా చేసుకుని డబ్బును ఎరగా వేసి టీడీపీ నేతలు ప్రలోభపెడుతున్నారని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి 17వ వార్డు కౌన్సిలర్ చింతకుంట సరిత జయలింగారెడ్డి ఇంటి వద్ద సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నేతలు డబ్బే అస్త్రంగా ఎన్నికల రంగంలోకి దిగుతున్నారన్నారు. టికెట్ కోసం పార్టీ అధిష్టానం వద్ద రూ.30 కోట్లు పెడుతున్నారని, రూ.30లక్షలు ఇచ్చి తమ పార్టీ కౌన్సిలర్లను కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారని, రూ.3వేలు ఇచ్చి ఎన్నికల్లో ఓట్లు వేయించుకునేందుకు వస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. 2019 ఎన్నికల నాటి నుంచి నేటి వరకు ఎక్కడా ప్రతిపక్ష పార్టీ నేతలు కనిపించలేదని, కేవలం ఎన్నికలు ఆరు నెలల ముందు నుంచి టీడీపీ టికెట్ మాకు.. మాకు అని పోటీపడుతున్నారన్నారు.

కరోనా కష్టకాలంలో ప్రజల వెన్నంటే ఉన్నాం

కరోనా కష్టకాలంలో తాము, తమ పార్టీ నాయకులు ప్రజల వెన్నంటే ఉన్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ముక్తియార్ మినహా టీడీపీ నాయకులు ఎవరు కరోనాలో కనిపించలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ద్వారా ఎన్నికైన తాను ఓ వైపు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు మరో వైపు అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా రూ.3వేల కోట్ల నుంచి రూ.3,500 కోట్ల వరకు లబ్ధి చేకూరిందన్నారు.

పచ్చ మీడియా విషం కక్కుతోంది

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేనైన తనపై ఏబీఎన్, ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ 5 ఛానళ్లు విషం కక్కుతున్నాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అబద్దాలను బూతద్దంలో చూపి చంద్రబాబుకు అండగా నిలుస్తున్నాయని విమర్శించారు. అధర్మ యుద్ధంలో గెలిచిందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. తమ పార్టీకి చెందిన 20 మంది కౌన్సిలర్ల వరకు టీడీపీ నేతలు ఫోన్ చేశారని, ఒక్కో కౌన్సిలర్‌కు రూ.12.50లక్షలు ఇస్తామని మభ్యపెట్టారని, మాట వినని వారిపై బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు, కలెక్టర్, డీఎస్పీ, ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. డబ్బుతో కొనుగోలు చేసి కౌన్సిలర్ల వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చుతున్నారన్నారు. తొలి మారు తన సేవలను గుర్తించి టికెట్ ఇచ్చారని, రెండో మారు ప్రతిపక్ష నేతగా సక్రమంగా పనిచేసినందుకు గుర్తించి టికెట్ ఇచ్చారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండటాన్ని గుర్తించి తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారన్నారు.

15 నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభం

ఈనెల 15వ తేదీ నుండి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ముక్తి రామలింగేశ్వరస్వామి, అమ్మవారిశాల ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు సీఎస్ ఖాజామొహిద్దీన్, పాతకోట బంగారు మునిరెడ్డితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, రాజుపాళెం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతాం

తాము ఎన్నటికీ వైఎస్సార్‌సీపీని వీడబోమని, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వెంటే నడుస్తామని మున్సిపల్ కౌన్సిలర్లందరూ ముక్తకంఠంతో తెలిపారు. 17వ వార్డు కౌన్సిలర్ చింతకుంట సరిత జయలింగారెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 39వ వార్డు కౌన్సిలర్ చింపిరి అనిల్ కుమార్ మాట్లాడుతూ కొంత మంది టీడీపీ నేతలు ఫోన్ ద్వారా తమ పార్టీలోకి రావాలని ప్రలోభపెట్టారన్నారు. తనతోపాటు మరికొంత మందికి ఫోన్ చేశారని తెలిపారు. తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని తెలిపారు. సమావేశంలో 38వ వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి, 31వ వార్డు కౌన్సిలర్ బలిమిడి వెంకటలక్ష్మి, 41వ వార్డు కౌన్సిలర్ గంజికుంట వెంకటసుబ్బమ్మతోపాటు కౌన్సిలర్లందరూ, వార్డు ఇన్‌చార్జి సమావేశంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని 12వ వార్డులో ఉండే 50 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గంగాధర్, హరిక్రిష్ణ, సుదర్శన్, శ్రీను, మిద్దె రమేష్, వెంకటరమణ, మాతయ్య, చిన్న ఓబన్న తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మహమ్మద్‌గౌస్, పెన్నా రషీద్, షాహిద్, కో–ఆప్షన్ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగతికి జనని లూర్దుమాత



లూర్దుమాత సందేశాన్ని అందజేస్తున్న మత గురువు

కడప కల్చరల్ : లూర్దుమాతను యావత్ జగతికి జననిగా భావించి ఆరాధిస్తారని ఉరుటూరు విచారణ గురువులు ఫాదర్ కాసు జోజిరెడ్డి అన్నారు. కడప నగర పరిధిలోని మరియాపురం పాత చర్చి ఆవరణలో నిర్వహిస్తున్న లూర్దుమాత నవదిన ఉత్సవాల సందర్భంగా ఆరవ రోజు బుధవారం ఎర్రగుంట్ల విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఇట్టా మోసెస్ దివ్యబలిపూజను సమర్పించారు. కాసు జోజిరెడ్డి లూర్దుమాత పేరిట సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11న లూర్దుమాత మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ లూర్దుమాత సన్నిధికి చేరి ఆమెను ఆరాధించాలని కోరారు. ఈ సందర్భంగా తొలుత భక్తులు లూర్దుమాత స్వరూపం గల పల్లకీతో మరియాపురం వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ బిరుసు రాజా, సహాయ గురువు ఫాదర్ అరుణ్, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు, పులివెందుల విచారణ గురువులు ఫాదర్ ప్రకాశ్, రెవరెండ్ ఫాదర్ బెర్నాడ్, చైతన్య, చిన్నప్ప, అనిల్, ఆరోగ్యమాత, జేఎంజే, క్రీస్తు జ్యోతి సిస్టర్లు, చర్చి పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తీరుపై పీడీ ఆగ్రహం



ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న అధికారులు

లింగాల : ఉపాధిహామీ పనులపై బుధవారం లింగాల ఎంపీడీఓ కార్యాలయలలో సోషల్ ఆడిట్ ఓపెన్‌ఫోరం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ అధికారులు మండల వ్యాప్తంగా సర్వే అనంతరం ఈ కార్యక్రమం చేపట్టారు. ఉపాధి హామీ పనుల తీరుపై అడిషనల్ పీడీ నాగరత్నమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాలుగా హార్టికల్చర్ ద్వారా చీనీ మొక్కలను రైతులకు అందించారు. అందుకు సంబంధించిన అంతర పంటలు, ఎరువులు, తదితర బిల్లులను రైతులకు చెల్లించడం లేదని ఆమె ఉపాధి హామీ మండల అధికారులపై మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు సక్రమంగా పనులను నిర్వహించి రైతులకు, కూలీలకు వేతనాలు సరిగా అందించాలన్నారు. ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను రైతులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శివారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి గంగాంజన్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ విజయభాస్కర్, మండల వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ఆధునికీకరణకు నూతన బడ్జెట్

- రూ. 23 కోట్లు కేటాయింపు
- చైర్ పర్సన్ లింగాల ఉషారాణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి

కడప కల్చరల్ : జిల్లా గ్రంథాలయ సంస్థను ఆధునికీకరించేందుకు రూ. 23 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను రూపొందించినట్లు చైర్ పర్సన్ లింగాల ఉషారాణి తెలిపారు. బుధవారం కడప నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి కోసం రూ. 23కోట్లతో బడ్జెట్ ప్రతిపాదలను ఆమోదించామని ఆమె వివరించారు. ఇందులో కొత్త పుస్తకాల కొనుగోలుకు రూ. 1.50 కోట్లు, కంప్యూటర్, జిరాక్స్ మిషన్, ఫర్నీచర్ కొనుగోలుకు రూ. 40 లక్షలు, నూతన భవన నిర్మాణాల కోసం రూ. 3 కోట్లు, గ్రంథాలయాల ఆధునీకరణ కోసం రూ. 5.60 లక్షలు, సిబ్బంది జీతాలు, పెన్షన్లు, పొరుగు సేవల సిబ్బంది వేతనాల కోసం రూ. 13.63 కోట్లను ఆమోదించామన్నారు. గత ఐదు సంవత్సరాల కంటే ఎక్కువగా 2023–24 సంవవత్సరం జనవరి వరకు వివిధ మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి గ్రంథాలయ సెస్ ద్వారా రూ. 3.57 కోట్లు సంస్థకు జమ అయిందని, ఇంకా రూ. 9 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ బాదుల్లా, వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు వెంకట సుబ్బారెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్‌వలీ, జిల్లా గ్రంథాలయ సంస్థల కార్యదర్శి సయ్యద్ అమీరుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసాచారి, ఉప గ్రంథాలయ అధికారి పవన్‌కుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్

గోపవరం : మండలంలోని నెల్లూరు–ముంబై (ఎన్‌హెచ్–67) జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడపకు చెందిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిమిట్ట మండలం పెద్దకొత్తపల్లె గ్రామానికి చెందిన పలుకూరి ప్రసాద్ నెల్లూరు జిల్లా సీతారామపురం వద్ద సైట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ద్విచక్ర వాహనంలో కడపకు వెళుతుండగా సెంచురీ పానెల్స్ పరిశ్రమ వద్ద బద్వేలు నుండి నెల్లూరుకు వెళుతున్న కారు అతివేగంగా వస్తూ ఒక్కసారిగా టైరు పగిలింది. దీంతో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ కాలు నుజ్జునుజ్జు అయింది. వెంటనే సమాచారం అందుకున్న 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా పెత్తకొత్తపల్లె గ్రామానికి చెందిన ప్రసాద్ గత కొన్నేళ్లుగా కడపలో నివాసముంటున్నాడు. కడపలోని ఓ కార్యక్రమానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బద్వేలు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

45 మద్యం బాటిళ్లు స్వాధీనం

దువ్వూరు : మండలంలోని సి.బయనపల్లె గ్రామ సమీపంలో బుధవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న గజ్జా బ్రహ్మయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి 45 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాల వద్ద అధికారులు

చెన్నూరు : చెన్నూరు అరుంధతివాడకు చెందిన కొండూరు హరికృష్ణకు చెందిన షెడ్డులో చెన్నూరుకు చెందిన కాటం వీరబ్రహ్మయ్య అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ ఉంచిన బియ్యాన్ని బుధవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 102 బస్తాలు, 4802 కేజీల రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని కడప సీఎస్‌డీటీకి అప్పగించారు. కాటం వీరబ్రహ్మయ్య, కొండూరు హరికృష్ణలపై చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు రెడ్డెప్ప, సీఐ ఐదురు బాషా, వ్యవసాయాధికారి బాలగంగాధర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని సహిత విద్య రిసోర్స్ పర్సన్‌లకు సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం కడప మండలం విద్యా వనరుల కేంద్రంలో నూతనంగా విధుల్లో చేరిన సహిత విద్య రిసోర్స్‌పర్సన్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు విధి వంచితులు కాకుండా విధాతలుగా మారేలా వారిలో ఉత్సాహాన్ని నింపాలన్నారు. విధి నిర్వహణలో తోటి రిసోర్స్‌పర్సన్‌లు, అధికారులు, పిల్లల తల్లిదండ్రులు, ప్రజలతో సన్నిహితంగా ఉండాలన్నారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ఎప్పటికప్పుడు నూతన విషయాలను తెలుసుకోవడం, మంచి భాషను ఉపయోగించడం అవసరమన్నారు. సహిత విద్య జిల్లా సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి మాట్లాడుతూ సహిత విద్య రిసోర్స్‌పర్సన్‌లు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని దివ్యాంగ విద్యార్థులను చైతన్య వంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓంఓ ధనలక్ష్మి, ఎస్ఎస్ఏ కార్యాలయ సూపరింటెండెంట్ మురళీమోహన్, జీసీడీఓ విజయలక్ష్మి, ఏపీఓలు రజనీకాంత్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రామాంజనేయరెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ లక్ష్మినరసింహారాజు, ఆర్పీలు విజయ, మమత, సిద్దారెడ్డి, గంగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌ను విజయవంతం చేయాలి



జిల్లాస్థాయి సైన్సుఫేర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి, తదితరులు

కడప ఎడ్యుకేషన్ : ఈనెల 10,11 తేదీలలో బద్వేలు జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కడప డీఈఓ కార్యాలయంలో జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరానికి మన జిల్లా నుంచి ఎంపికైన 189 ప్రాజెక్టులకు సంబంధించిన ఎగ్జిబిట్స్ ఇందులో ప్రదర్శిస్తారన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి 9441035830 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు మునీర్‌ఖాన్, దేవరాజు, సెక్టోరియల్ అధికారులు దశరథరామిరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతిపై పూర్తిస్థాయి విచారణ

రాజంపేట : జిల్లాలోని పీలేరు వద్ద టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి చంపిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందని జిల్లా అటవీశాఖాధికారి వివేక్ బుధవారం తెలిపారు. టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ గణేష్ మృతి లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంఘటనను రాష్ట్ర అటవీశాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని , సానుభూతిని తెలియజేశారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

పిల్లల చదువుకు ఇబ్బంది లేదు



మాది మైదుకూరు మండలం, తువ్వపల్లె. వ్యవసాయ కూలీలం, నాకు నలుగురు పిల్లలు. పెద్దమ్మాయి హర్షిత ఇంటర్ చదువుతోంది. పెద్ద కుమారుడు విష్ణువర్ధన్ 9వ తరగతి చదువుతున్నాడు. రెండో అబ్బాయి భానుప్రకాష్ 8వ తరగతి చదువుతున్నాడు. రెండో అమ్మాయి శ్రీవల్లి మూడో తరగతి చదువుతోంది. భానుప్రకాష్ ఏడో తరగతిలో ఉండగా మొదటిసారి నాకు అమ్మ ఒడి కింద ఆర్థిక సాయం అందింది. తర్వాత శ్రీవల్లి రెండో తరగతిలో ఉండగా రెండో సారి అమ్మ ఒడి పథకం కింద సాయం అందుకున్నాను. నలుగురు పిల్లల చదువులకు ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి కింద చేస్తున్న ఆర్థిక సహాయంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ఉంది. నాలాంటి ఎంతో మంది పేద కుటుంబాల వారికి జగనన్న అందిస్తున్న సాయం మరువలేనిది.

- కాలువపల్లె స్వాతి, తువ్వపల్లె, మైదుకూరు మండలం.

సొంతింటి కల నెరవేరింది



సొంతింటి కల నెరవేర్చుకున్నానంటున్న సిద్ద యోగమాంబ

నేను 12 ఏళ్ల క్రితం వీరబల్లికి వచ్చి స్థిరపడ్డాను. నాకంటూ సొంత ఇల్లు కూడా లేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఇల్లు లేని వారికి ఇల్లు ఇస్తున్నారనే విషయం తెలిసి దరఖాస్తు చేసుకున్నాను. ఇల్లు మంజూరు చేశారు. ఇల్లు నిర్మించుకున్నాను. సంతోషంగా ఉంది. నాలాంటి వారి సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రుణం తీర్చుకోలేనిది.

- సిద్దయోగమాంబ, వీరబల్లి

'మద్యం మత్తులో పురుగుమందు తాగాడు'

మదనపల్లె: మద్యం అతిగా తాగి దిక్కుతోచని స్థితిలో ఓ వ్యక్తి పురుగుమందు తాగిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లి మండలంలో జరిగింది. కొత్తపల్లి పంచాయతీ బండకిందపల్లెకు చెందిన రంగప్ప కుమారుడు జి.లోకేష్ (40), మంగళవారం రాత్రి మద్యం పూటుగా తాగి ఇంటికి వచ్చాడు. మత్తు అధికం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఇంటిలో ఉన్న పురుగుమందు తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఔట్ పోస్ట్ పోలీసులు ఎందుకు పురుగుమందు తాగావని ప్రశ్నిస్తే, పొరపాటున తాగేశానని ఆత్మహత్య చేసుకునేందుకు కాదని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.

మహిళ ఆత్మహత్య

రాయచోటి టౌన్ : అత్తింటి వారి వేధింపులు తాళలేక పవిత్ర అనే మహిళ (25) ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండల పరిధిలోని దూళ్లవారిపల్లెకు చెందిన మహేష్ ఆరు సంవత్సరాల క్రితం పవిత్రను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక సంవత్సరం కుమారుడు ఉన్నాడు. అయితే గత కొన్ని రోజులుగా అదనంగా కట్నం తీసుకురావాలని అత్తింటివారు వేధిస్తుండటంతో ఆమె మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త మహేష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన కృష్ణకుమారి (40) ఆరు సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో కర్ణాటక నుంచి మదనపల్లెకు వచ్చి తల్లి రెడ్డెమ్మ వద్ద ఉంటోంది. ఈ క్రమంలో రెండు రోజులనుంచి ఆమె కనిపించకుండా పోయింది.